AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

విమానం ప్రమాదం.. కాక్‌పిట్ ఆడియో విశ్లేషణ

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: విమాన ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన సీనియర్ నేత, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రమాదానికి దారితీసిన చివరి క్షణాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. విమానం రన్‌వేకు సమీపిస్తున్న సమయంలో అకస్మాత్తుగా సాంకేతిక లోపం తలెత్తినట్టు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ నుంచి లభించిన ఆడియో క్లిప్‌ను నిపుణులు విశ్లేషిస్తున్నారు. విమానం కూలుతున్న సమయంలో పైలట్ నోటి నుంచి 'ఓ.. షిట్' అనే మాటలు వినిపించాయి. ఆ మరుక్షణమే భారీ శబ్దంతో విమానం నేలకూలింది.

కులగణనపై పార్టీలు తమ స్టాండ్ చెప్పాలి: కవిత

అక్షరటుడే, హైదరాబాద్: కులగణనపై అన్ని పార్టీలు కూడా తమ స్టాండ్ ఏంటో చెప్పాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాతీయ జన గణన, కులగణన అంశాలపై గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కులగణనకు కేంద్రం ముందుకు రావడంతో సంతోషించామన్నారు. కానీ ఎప్పుడైతే డాక్యుమెంట్ విడుదల చేశారో అప్పుడే వాళ్ల బుద్ధి బయట పడిందని వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీల కాలం పెట్టారని.. కానీ ఓబీసీ లేకుండా కులం అనే కాలం మాత్రమే డాక్యుమెంట్‌లో పెట్టారని పేర్కొన్నారు.

29-1-2026 (Thursday) MAIN EDITION

చట్టంముందు అందరూ సమానమే..

అక్షరటుడే, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి స్పందించారు. కేసీఆర్‌పై కుట్రలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలకు అర్థం లేదన్నారు. చట్టం ముందు అందరూ సమానమే అని అన్నారు.

హోంగార్డు ఇంట్లో ఏసీబీ సోదాలు

అక్షరటుడే, ఏపీ: విజయనగరం జిల్లాలో ఏసీబీ సోదాలు చేపట్టింది. ఎస్.కోటలో హోంగార్డు శ్రీనివాసరావు నివాసంలో తనిఖీలు నిర్వహించింది. అక్రమ సంపాదనతో ఆయన భారీగా డబ్బు, ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు.

బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు కుంబింగ్ చేస్తుండగా నక్సల్స్ తారసపడ్డారు. దీంతో భద్రతా దళాలు, నక్సలైట్ల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్ కౌంటర్‌లో ఇద్దరు నక్సలైట్లు మరణించినట్లు అధికారులు తెలిపారు. గాలింపు చర్యలు సమయంలో కాల్పుల ఘటన చోటుచేసుకుంది.

ఈయూతో వాణిజ్య ఒప్పందం భారత్‌కు కీలకం: మోదీ

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: ఈయూతో వాణిజ్య ఒప్పందం దేశ భవిష్యత్‌కు కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పార్లమెంట్ వద్ద గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఆకాంక్షలున్న భారతదేశం కోసమేనని, తమకు తెరుచుకుంటున్న కొత్త మార్కెట్ల నుంచి ప్రయోజనం పొందాలని తయారీదారులను ప్రధాని కోరారు. కొత్త మార్కెట్ తెరుచుకుందని, 27 యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలన్నారు. ఈ త్రైమాసికం చాలా సానుకూల దృక్పథంతో ప్రారంభమైందని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసం గల భారత్ ఇప్పుడు ప్రపంచానికి ఆశాకిరణంగా మారిందన్నారు.

యూజీసీ కొత్త నిబంధనలపై సుప్రీం స్టే

అక్షరటుడే, ఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ కమిటీల ఏర్పాటును తప్పనిసరి చేస్తూ యూజీసీ తీసుకున్న నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు స్టే విధించింది. యూజీసీ మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నాయని, అవి దుర్వినియోగం కావచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. తదుపరి నోటీసు ఇచ్చేంత వరకు వివాదాస్పద నిబంధలను నిలిపివేయాలని కేంద్రాన్ని, యూజీసీని ఆదేశించింది.

కూలిన చార్టర్డ్ ఫ్లైట్.. 15 మంది దుర్మరణం

అక్షరటుడే, నేషనల్ డెస్క్: వరుస విమాన ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. తాజాగా కొలంబియాలోని నార్తె డె సంటాన్‌డెర్ ప్రావిన్స్‌లో ప్రయాణిస్తున్న ఓ చార్టర్డ్ విమానం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంలో మొత్తం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 13 మంది ప్రయాణికులు కాగా, ఇద్దరు విమాన సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు అందించారు. ఈ కేసులో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌రావును ఇటీవల అధికారులు విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా కేసీఆర్‌కు సైతం నోటీసులు ఇచ్చారు. ఆయన కోరిన చోట విచారించేందుకు సిద్ధమని అధికారులు తెలిపారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

– అక్షరటుడే, హైదరాబాద్

కేసీఆర్‌కు సిట్ నోటీసులు

▸ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం ▸ రేపు విచారించనున్న అధికారులు ▸ ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో ప్రశ్నించే అవకాశం

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ అధికారులు విచారణ వేగవంతం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్ష నేతలతో పాటు, జడ్జీలు, వ్యాపారులు, సినీ ప్రముఖుల ఫోన్లు ట్యాప్ అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై 2024 మార్చిలో పంజాగుట్టలో కేసు నమోదైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ ప్రభాకర్‌రావును సిట్ అధికారులు కస్టడీకి తీసుకొని విచారించారు. మిగతా నిందితులను సైతం ప్రశ్నించారు. అప్పటి ప్రభుత్వ పెద్దలు చెప్పడంతోనే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు వారు చెప్పారని సమాచారం. దీంతోనే సిట్ అధికారులు బీఆర్ఎస్ నేతలను విచారిస్తున్నారు.

బీర్ఎస్‌లో కలవరం

ఫోన్ ట్యాపింగ్ కేసులో గత పది రోజులు గా బీఆర్ఎస్ ముఖ్య నేతలను సిట్ అధికారులు విచారించారు. మొదట మాజీ మంత్రి హరీశ్‌రావును ప్రశ్నించారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించారు. ఇద్దరిని ఏడు గంటల పాటు ప్రశ్నించారు. ఇటీవల మాజీ ఎంపీ సంతోష్‌రావును సైతం పిలిచారు. కేసీఆర్ కుటుంబ సభ్యులను విచారించిన అధికా రులు పలు కీలక వివరాలు రాబట్టినట్లు తెలు స్తోంది. ఈ క్రమంలో తాజాగా కేసీఆర్‌ను సైతం విచారించేందుకు సిద్ధం అయ్యారు. దీంతో బీఆర్ఎస్ నాయకుల్లో కలవరం మొదలైంది.

ఎన్నికల వేళ..

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల సందడి నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేతతో పాటు ముఖ్య నేతలను సిట్ విచారిస్తుండటం గమనార్హం. ఓ వైపు కాంగ్రెస్ ప్రచారంలో దూసుకుపోతుంది. బీఆర్ఎస్ సైతం కాంగ్రెస్ కుంభకోణాలు చేసినట్లు పలు ఆరోపణలు చేసింది. అయితే ఫోన్ ట్యాపింగ్ విచారణతో బీఆర్ఎస్ శ్రేణులు కొంత ఆందోళనకు గురి అవుతున్నాయి. ఎన్నికల్లో ఈ వ్యవహారం గులాబీ పార్టీకి ఏమైనా నష్టం చేస్తుందా అని భయపడుతున్నారు.

హార్వర్డ్ విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం

అక్షరటుడే, నేషనల్ డెస్క్: హార్వర్డ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం అయ్యారు. భారతీయ విద్యార్థులతో ముచ్చటించారు.ముఖ్యమంత్రి ఇటీవల దావోస్ పర్యటన ముగించుకొని అమెరికా వెళ్లిన విషయం తెలిసిందే. ఆయన హార్వర్డ్ యూనివర్సిటీలో '21వ శతాబ్దం కోసం నాయకత్వం' అనే అంశంపై నిర్వహిస్తున్న వారం రోజుల కోర్సులో చేరారు. విద్యార్థిగా మారి తరగతులు వింటున్నారు. ఈ నెల 30 వరకు సీఎం తరగతులకు హాజరవుతారు. ఈ క్రమంలో హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లోని భారతీయ విద్యార్థుల బృందం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యూనివర్సిటీ క్యాంపస్‌లోని తమ పాఠశాలను సందర్శించమని ఆహ్వానించింది. బిజీ షెడ్యూల్‌లో సైతం సీఎం అన్ని తరగతులు, అసైన్‌మెంట్‌లను పూర్తి చేసిన తర్వాత విద్యార్థులను ఆహ్వానించి వారితో సంభాషించారు.

ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్

అక్షరటుడే, ఢిల్లీ: భారత వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.8 - 7.2 శాతం ఉంటుందని ఆర్థిక సర్వే తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి 7.4 శాతం ఉండే అవకాశం ఉందని పేర్కొంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ఆర్థిక సర్వేను లోక్‌సభలో ప్రవేశ పెట్టారు. ప్రతి సంవత్సరం బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశ పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. వాణిజ్య విచ్ఛిన్నం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పెరుగుతున్న ఆర్థిక దుర్బలత్వాల కారణంగా ప్రతికూల ప్రమాదాలు తీవ్రమవుతున్నప్పటికీ, భారతదేశ వృద్ధి అంచనా కంటే మెరుగ్గా ఉందని సర్వే తెలిపిందన్నారు. రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన 4 శాతం కంటే తక్కువగా ద్రవ్యోల్బణం ఉందని పేర్కొన్నారు. దేశీయంగా వినియోగం ఊపందుకోవడంతో ఆర్థిక వ్యవస్థ బలంగా మారిందన్నారు. ఈ రెండు అంశాలు భారత ఆర్థిక పటిష్టతకు నిదర్శనమని ఆర్థిక మంత్రి తెలిపారు. మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు.

అందుకే కేసీఆర్‌కు నోటీసులు: హరీశ్‌రావు

అక్షరటుడే, హైదరాబాద్: ప్రజావ్యతిరేకత, సింగరేణి కుంభకోణం నుంచి దృష్టిని మళ్లించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంపై ఆయన స్పందించారు. రాజకీయ వేధింపులతో మున్సిపాలిటీ ఎన్నికల్లో లబ్ధి పొందే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణ సమాజమంతా.. కేసీఆర్ వెంటే ఉందని, రేవంత్‌రెడ్డి రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌పై బురద చల్లాలని ప్రయత్నించడం.. సూర్యునిపై ఉమ్మి వేయడంలాంటిదేనన్నారు.

మేడారం జాతర ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు

అక్షరటుడే, ములుగు: మేడారం మహా జాతర ఘనంగా కొనసాగుతోంది. లక్షలాది మంది భక్తులు అమ్మవార్ల దర్శనం కోసం తరలి వస్తున్నారు. దీంతో వనమంతా జన సందడి నెలకొంది. మేడారం జాతర గురువారం రెండో రోజు కొనసాగుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. స్వయంగా బైక్‌పై పలు ప్రాంతాలకు వెళ్లి భక్తులతో మాట్లాడారు. అన్ని ఏర్పాట్లతో మేడారం మహా జాతర సజావుగా కొనసాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు.

శింబుకి జోడీగా మృణాల్..!

జెర్సీ, సీతారామం సినిమాలతో తెలుగు తెరపై మెరిసింది మృణాల్ ఠాకూర్. ఈ అందాల తార వివిధ ఇండస్ట్రీల్లో హీరోయిన్‌గా రాణిస్తోంది. ఈ సంవత్సరం వరుస సినిమాలతో తెరపై సందడి చేయడానికి రెడీ అవుతోంది. ఇందులో భాగంగానే ఆమె.. మరో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. శింబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఎస్‌టీఆర్51' (వర్కింగ్ టైటిల్). 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో కథానాయికగా మృణాల్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ప్రస్తుతం దీని గురించే చర్చలు జరుగుతున్నాయని, అన్నీ సవ్యంగా జరిగితే ఈ సినిమాతోనే మృణాల్ తమిళంలోకి అడుగుపెట్టనుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేసి.. 2027లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు చిత్ర వర్గాలు చెప్పాయి.

– అక్షరటుడే, సినిమాడెస్క్

కంటైనర్‌ను ఢీకొన్న లారీ..

అక్షరటుడే, ఏపీ: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కంటైనర్‌ను లారీ ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఒకరు సజీవ దహనం అయ్యారు. కత్తిపూడి సమీపంలోని రావికంపాడు జంక్షన్ వద్ద బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఒక కంటైనర్ యూటర్న్ తీసుకుంటున్న సమయంలో మరో లారీ కంటైనర్ ఢీకొంది. ఆ సమయంలో రెండు వాహనాలు నెమ్మదిగా ఉన్నాయి. అయితే కంటైనర్‌ను డీజిల్ ట్యాంక్ వద్ద ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రెండు లారీల క్యాబిన్లకు మంటలు భారీగా వ్యాపించాయి. దీంతో రెండు లారీల డ్రైవర్లు బయటకు దూకారు. అయితే వెనకనుంచి ఢీకొన్న కంటైనర్ లారీలో ఉన్న క్లీనర్ సజీవ దహనం అయ్యారు. పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు.